## ఇలాంటి ఆలయాన్ని ఎక్కడా చూడలేదు

### రామప్ప శిల్పకళను చూసి ముగ్ధులైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ

వెంకటాపూర్, అక్టోబర్ 18 : ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప లాంటి ఆలయాన్ని ఎక్కడా చూడలేదని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అన్నారు. బుధవారం ములుగు పర్యటనకు రాగా ఆలయానికి వచ్చారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం టూరిజం గైడ్ ద్వారా రామప్ప శిల్పకళా సౌందర్యం, చరిత్రను తెలుసుకున్నారు. తమ జీవితంలో రామప్ప లాంటి అతి సుందరమైన ఆలయాన్ని చూడలేదన్నారు. ఆలయాన్ని ఎన్ని సంవత్సరాలు కట్టారు? ఎంత మంది పనిచేశారని గైడ్‌ను అడుగగా సుమారు 40 సంవత్సరాలు, రామప్ప అనే ప్రధాన శిల్పి ఆధ్వర్యంలో 300 మంది కట్టినట్లు వివరించారు. విదేశీయుల విగ్రహాలను చూపించగా వాటిని ఎందుకు చెక్కారని గైడ్‌ను అడుగగా ఆ రోజుల్లోనే కాకతీయులకు విదేశీయులతో వ్యాపార సంబంధాలున్నాయని చెప్పారు. నంది విగ్రహాన్ని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ మూడు నిమిషాల పాటు చూసి ఫొటోలు, వీడియోలు తమ మొబైల్‌లో బంధించుకున్నారు.

**సందర్శించినందుకు ధన్యవాదాలు : వీ ప్రకాశ్**

తన స్వగ్రామం పాలంపేట రామప్ప దేవాలయాన్ని సందర్శించినందుకు జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్‌రావు రాహుల్, ప్రియాంకకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికాలో ఉన్న ఆయన పార్టీలు వేరైనా రామప్పకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.



రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ

### బీఆర్ఎస్‌లో చేరిన నిమ్మగూడెం యువకులు

మహాముత్తారం, అక్టోబర్ 18 : మంథని నియోజకవర్గంలో వాస్తవ విషయాలపై యువత చర్చించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన వంద మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కల్వచర్ల రాజు తదితరులు ఉన్నారు.



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న శిక్షణ ఏఎస్‌వోలు

## ఆరోగ్య సిబ్బంది సేవలు మరువలేనివి

గణపురం, అక్టోబర్ 18 : ఆరోగ్య సిబ్బంది సేవలు మరువలేనివని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు (ఏఎస్‌వో) దీక్షా భరద్వాజ్, దీపిక, అభిజిత్, రజత్ భాటియా, ఆర్తి మీనా అన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న వీరు ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేయడంలో భాగంగా బుధవారం మండలంలోని చెల్పూరుకు వచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత పాఠశాల, సెగ్రిగేషన్‌షెడ్, క్రిమటోరియం నర్సరీ, చెరువును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కరోనా కాలంలో ఆరోగ్య సిబ్బంది బాగా పని చేశారని, వారి వల్లే మరణాలు తగ్గాయన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి హేమంత్, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

మహదేవపూర్, అక్టోబర్ 18 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని రాపల్లికోటలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజామోదయోగ్య పథకాలను ప్రజలు ఆదరించి బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పుట్ట మధుకు ప్రజలు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజక్క, ఐలయ్య, సదాశివ్, రంజిత్, నిరంజన్, సారయ్య, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గణపురం, అక్టోబర్ 18 : రోజురోజుకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారని, ఆరోగ్య సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని ఎంపీడీవో లెక్కల అరుంధతి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కావటి రజితా రవీందర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ఏఈవో ఐలయ్య అగ్రో సంస్థ ద్వారా రైతులకు మూడు వందల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందించామని, రైతు బంధు పథకం ద్వారా మండలంలోని 8,950 మంది రైతుల ఖాతాల్లో రూ. 8,52,25,134 జమ చేశామన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు ప్రతినెలా అందిస్తున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్ సాయిని సతీష్ కుమార్, ఎంపీటీసీలు మంద అశోక్‌రెడ్డి, మారగాని సరస్వతి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, ఏపీవో రాజు, ఏపీఎం ఇమామ్, మండలంలోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ రవీందర్

## మరమ్మతు పనుల పరిశీలన

మహదేవపూర్, అక్టోబర్ 18 : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బొమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 184వ బూత్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను బుధవారం పంచాయితీ రాజ్ ఏఈ రవీందర్ పరిశీలించారు. పలు బూత్‌ల వద్ద అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. బూత్‌లలో విద్యుత్, తాగు నీటి సౌకర్యంతో పాటు పోలింగ్ స్టేషన్ వద్ద మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం శంకరయ్య, సిబ్బంది ఉన్నారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

పలిమెల, అక్టోబర్ 18 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షురాలు, ఇతర సభ్యులెవరూ హాజరుకాపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

## మహాలక్ష్మిగా అమ్మవారు

మహదేవపూర్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని గర్భగౌరీ ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మాడుగుల చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మెరుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు మోటం వెంకటేశ్వర్లు, వడిజె రామకృష్ణ, కేదారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ కాటారం మండల మహిళా అధ్యక్షురాలిగా సౌజన్య

కాటారం, అక్టోబర్ 18 : బీఆర్ఎస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నియోజక వర్గ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న రత్న సౌజన్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంథని నియోజక వర్గ అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మహిళా కార్యకర్తలను కలుపుకొని పని చేయాలని ఆయన సూచించారు.



నియామక పత్రం అందజేస్తున్న పుట్ట మధు

## రాహుల్ జీ.. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవకండి

- సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ములుగులో అభివృద్ధి
- మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత

మహబూబాబాద్, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీగా ఉన్న ములుగును జిల్లా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది.. సర్కార్ ఆసుపత్రి కూడా లేని ములుగుకు మెడికల్ కళాశాల ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ములుగులో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పర్యటనపై ఆమె స్పందించారు. కొత్త రెవెన్యూ డివిజన్, కొత్త మండలాలు, వందల కోట్ల నిధులిచ్చి ములుగులో అభివృద్ధి వెలుగులు తెచ్చిన గొప్ప మనసు కేసీఆర్‌ది.. అభివృద్ధి, ప్రజా సంక్షేమాలకు రాజ కీయాలను ముడిపెట్ట కూడదనే మహోన్నత లక్ష్యంతో, ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్నచోట కూడా ములుగు అభివృద్ధికి బాటలు వేసిన మహా నాయకుడు కేసీఆర్ అని అన్నారు. వచ్చి వెళ్లడం కాదు.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ములుగు నియోజకవర్గంలో ఊరు వాడ ఎలా అభివృద్ధి చెందాయో.. ప్రజలకు, ప్రతి ఇంటికి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో తెలుసుకొని వెళ్లండి అని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీకి సూచించారు. పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న మీరు ఒక్క రోజు కూడా గిరిజన యూనివర్సిటీపై ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే, మీరెందుకు మౌనంగా ఉన్నారో సమాధానం ఇచ్చిన తర్వాత ములుగును వదిలి వెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు.. మీ ఆరు గ్యారెంటీలు ఎవరూ పట్టించుకోవడం లేదని అర్థం చేసుకోండి అన్నారు. రాహుల్..జీ...ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లకుండా ములుగులో జరిగిన అభివృద్ధి చూసి వెళ్లాలని హితవు పలికారు.

